
ఆంధ్రజ్యోతి ***

ANDHRAJYOTHY



నల్లగొండ

5

మంగళవారం 11 జూన్ 2024

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442

యాదాద్రి : 1800 425 7106

సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.174	270	300
సూర్యాపేట	రూ.180	250	270
నల్లగొండ	రూ.172	240	270

ఉష్ణోగ్రత గరిష్ఠం 35.0 । కనిష్ఠం 24.4



డీసీసీబీ పీఠంపై కాంగ్రెస్ కన్ను

- చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డిపై అవిశ్వాసం
- కుంభం శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో నోటీసులు ఇచ్చిన 14మంది డైరెక్టర్లు
- ఆలోగా చైర్మన్ పదవికి రాజీనామా యోచనలో గొంగిడి?
- కొత్త చైర్మన్‌గా శ్రీనివాస్‌రెడ్డికి చాన్స్

అసెంబ్లీ ఎన్నికల్లో అప్రతిహత విజయాలు, పార్లమెంటు ఎన్నికల్లో రికార్డు మెజార్టీలతో గెలుపు, ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో విజయంతో ఉమ్మడి జిల్లాలో దూసుకెళ్తున్న కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి జిల్లా డీసీసీబీ పీఠంపై కన్నేసింది. రూ.2లక్షల రుణమాఫీకి ప్రభుత్వం కసరత్తు ముమ్మరం చేసిన సందర్భంలో, ఆ ప్రక్రియ ప్రారంభమయ్యేలోగా డీసీసీబీ చైర్మన్ పీఠం దక్కించుకునేందుకు వ్యూహం రచించింది. ఇప్పటికే డీసీసీబీ వైస్ చైర్మన్ సహా మెజార్టీ డైరెక్టర్లు కాంగ్రెస్ వైపునకు రావడంతోపాటు చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టేందుకు సిద్ధమయ్యారు. అవిశ్వాసానికి సిద్ధమైన డైరెక్టర్లు మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని సంప్రదించగా, వారు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో అవిశ్వాస ప్రక్రియను ప్రారంభించారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అనుచరుడు, డీసీసీబీ డైరెక్టర్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి నేతృత్వంలో మొత్తం 14 మంది డైరెక్టర్లు వారి సంతకాలతో కూడిన నోటీసును జిల్లా సహకార అధికారి కిరణ్‌కుమార్‌కు సోమవారం అందజేశారు.

- (ఆంధ్రజ్యోతి ప్రతినిధి,నల్లగొండ)

'కుంభం'కే పదవి దక్కే అవకాశం..



క్యాంపునకు వెళ్తున్న డీసీసీబీ డైరెక్టర్లు

మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ప్రధాన అనుచరుడిగా పేరున్న మునుగోడు నియోజకవర్గానికి చెందిన డీసీసీబీ డైరెక్టర్ కుంభం శ్రీనివాస్‌రెడ్డికే డీసీసీబీ చైర్మన్ పదవి దక్కే అవకాశం ఉంది. ప్రస్తుత చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డిపై అవిశ్వాసం ప్రవేశపెట్టేందుకు డైరెక్టర్లను సమీకరించడంతో పాటు, మంత్రులు, ఎమ్మెల్యేలను ఒప్పించే ప్రక్రియలో ఆయనే క్రియాశీలకంగా వ్యవహరించారు. అవిశ్వాస నోటీసు ఇచ్చిన డైరెక్టర్లంతా కుంభం శ్రీనివాస్‌రెడ్డికే మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిసింది. డైరెక్టర్లు నోటీసు ఇచ్చేందుకు శ్రీనివాస్‌రెడ్డి నేతృత్వంలో ప్రత్యేక బస్సులో నల్లగొండకు తరలివచ్చారు. అనంతరం డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, డీసీసీబీ డైరెక్టర్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. పదవీ కాంక్షతో తాము అవిశ్వాసతీర్మానం పెట్టలేదని, నాలుగేళ్లుగా డీసీసీబీలో మహేందర్‌రెడ్డి ఏకపక్షంగా వ్యవహరించారని, ఉద్యోగుల బదిలీలు, ఇతర కార్యకలాపాల్లో ఇష్టారీతిగా వ్యవహరించారని, డైరెక్టర్లను పరిగణనలోకి తీసుకోలేదని వారు పేర్కొన్నారు. కేసీఆర్, కేటీఆర్ వల్లే తనకు పదవి వచ్చిందని మాట్లాడేవారని, కానీ రైతుల దయాదాక్షిణ్యంతో పదవులు వచ్చిన విషయాన్ని విస్మరించారని ఆరోపించారు. రైతుల ప్రయోజనాలను కాపాడేందుకే తాము చైర్మన్ మహేందర్‌రెడ్డిపై అవిశ్వాసం ప్రవేశపెట్టామని పేర్కొన్నారు. నోటీసు ఇచ్చిన అనంతరం డైరెక్టర్లంతా ప్రత్యేక బస్సులో క్యాంపునకు తరలివెళ్లారు.

అవిశ్వాసపు నోటీసుపై 28న ప్రత్యేక సమావేశం

ఎన్‌డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డిపై కాంగ్రెస్ మద్దతుతో డైరెక్టర్లు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై ఈనెల 28న ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్లు జిల్లా సహకార అధికారి కిరణ్‌కుమార్ వెల్లడించారు. తెలంగాణ సహకార చట్టం-1964, సెక్షన్ 34/ఏ ప్రకారం డైరెక్టర్లు చైర్మన్‌పై అవిశ్వాస నోటీసు ఇచ్చారు. సహకార చట్ట నిబంధనల ప్రకారం నోటీసు ఇచ్చిన 15 పని దినాలలోగా ప్రత్యేక సమావేశం నిర్వహించి అవిశ్వాస తీర్మానంపై చర్చించి, అవసరమైతే ఓటింగ్ నిర్వహించాల్సి ఉంటుంది. ఈ నిబంధనల ప్రకారం ఈనెల 28వ తేదీ ఉదయం 11గంటలకు ప్రత్యేక సమావేశం నిర్వహించాలని సహకార శాఖాధికారి నిర్ణయించారు. అవిశ్వాస తీర్మాన నోటీసుపై పాలకవర్గ డైరెక్టర్లు కుంభం శ్రీనివాస్‌రెడ్డి, గుడిపాటి సైదులు, ధనావత్ జయరాం, కోడి సుష్మ, పాశం సంపత్‌రెడ్డి, అందెల లింగం యాదవ్, విరిగినేని అంజయ్య, బంటు శ్రీనివాస్, కొండ సైదయ్య, ఎస్.అనూరాధ, జూలూరి శ్రీనివాస్, కె.వీరస్వామి, కొమ్ము కరుణ, ఎం.రామచంద్రయ్య సంతకాలు చేశారు. డీసీసీ ఉపాధ్యక్షుడు ఏసిరెడ్డి దయాకర్‌రెడ్డి సైతం అవిశ్వాసానికి మద్దతు ప్రకటించారని,ఆయన విదేశీ పర్యటనలో ఉన్నందున నోటీసుపై సంతకం చేయలేకపోయారని కాంగ్రెస్‌కు మద్దతు ఇస్తున్న డైరెక్టర్లు తెలిపారు.అవిశ్వాస తీర్మాన నోటీసు ఇచ్చిన 14మంది డైరెక్టర్లలో కుంభం శ్రీనివాస్‌రెడ్డి మినహా మిగిలిన వారంతా అసెంబ్లీ ఎన్నికల ముందు వరకు బీఆర్ఎ్‌స్‌లో కొనసాగినవారే. అసెంబ్లీ ఎన్నికల సమయంలో, ఆ తరువాత వారంతా క్రమక్రమంగా కాంగ్రె్‌సలో చేరారు. ప్రధానంగా గొంగిడి మహేందర్‌రెడ్డి ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారనే ప్రధాన ఆరోపణతో వారంతా అవిశ్వాసానికి మొగ్గుచూపారు.

గొంగిడి రాజీనామా చేసే చాన్స్?

డీసీసీబీ పాలకవర్గంలో అవిశ్వాసం నెగ్గేందుకు అవసరమైన సంఖ్యాబలం కాంగ్రె్‌సకు ఉండడంతో తీర్మానంపై సమావేశానికి ముందే చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి రాజీనామా చేసే అవకాశాలు కన్పిస్తున్నాయి. మొత్తం 19మంది డైరెక్టర్లలో 15 మంది ఆయనకు వ్యతిరేకంగా ఉండడంతో తీర్మానం నెగ్గడం ఖాయంగా కనిపిస్తోంది. మొత్తం పాలకవర్గంలో మూడింట రెండొంతుల మెజార్టీ ఉంటే అవిశ్వాస తీర్మానం నెగ్గుతుంది. ఇప్పటికే కాంగ్రె్‌సకు ఈ సంఖ్యాబలం ఉండటంతో పదవీచ్యుతుడవడానికి ముందే ఒకటి, రెండు రోజుల్లో ఆయన రాజీనామా చేస్తారని విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. రాజీనామా సందర్భంగా అవిశ్వాసానికి దారితీసిన పరిస్థితిపై మహేందర్‌రెడ్డి ప్రకటన చేసే అవకాశం ఉందని బీఆర్ఎస్ వర్గాలు పేర్కొంటున్నాయి. ఇటీవలి వరకు టెస్కాబ్ వైస్ చైర్మన్‌గానూ కొనసాగిన మహేందర్‌రెడ్డి అక్కడ కూడా అవిశ్వాస తీర్మానపు నోటీసు ఇవ్వడంతో టెస్కాబ్ చైర్మన్‌తో కలిసి ఆ పదవికి రాజీనామా చేశారు. తాజాగా అదే బాటలో డీసీసీబీ చైర్మన్ పదవికి కూడా ప్రత్యేక సమావేశానికి ముందే ఆయన రాజీనామా చేస్తారని తెలుస్తోంది.



సహకార శాఖాధికారికి నోటీసు అందజేస్తున్న డీసీసీబీ డైరెక్టర్లు

కోడ్ ముగిసె.. ఆశలు చిగురించే

245 రోజుల్లో 144 రోజులూ ఎన్నికల కోడ్

అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు పట్టాలెక్కేనా?

అసెంబ్లీ ఎన్నికలు, ఆ తరువాత పార్లమెంట్ ఎన్నికలు, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక కోడ్ రాగా, ప్రభుత్వ పాలనకు అడ్డుగా మారి అభివృద్ధి, సంక్షేమ పథకాలు నిలిచాయి. ఆదివారంతో ఎమ్మెల్సీ ఉప ఎన్నికల కోడ్ ముగిసింది. అసెంబ్లీ ఎన్నికల కోడ్ 58 రోజులు కొనసాగగా, పార్లమెంట్ ఎన్నికలు, ఎమ్మెల్సీ ఉప ఎన్నిక కోడ్ మరో 86 రోజుల పాటు కొనసాగింది. మొత్తంగా 245 రోజుల్లో 144 రోజులు ఎన్నికల కోడ్ నడిచింది. దీంతో ఎక్కడికక్కడ అభివృద్ధి, సంక్షేమ పథకాలు నిలిచాయి. ప్రస్తుతం ఎన్నికల కోడ్ ముగియగా ప్రభుత్వం పాలనపై దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో అభివృద్ధి,సంక్షేమ పథకాలు పట్టాలెక్కుతాయని ప్రజలు భావిస్తున్నారు. అయితే ఇప్పటికే పంచాయతీల పాలకవర్గాల గడువు ముగిసింది. దీంతో పాటు మండల, జిల్లా పరిషత్ పాలకవర్గాల గడువు కూడా త్వరలో ముగియనుంది. దీంతో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. అయితే ఈ ఎన్నికల నిర్వహణపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు. రైతు రుణమాఫీ, ఆరు గ్యారెంటీల అమలు, బీసీ గణన తరువాతే స్థానిక సంస్థల ఎన్నికలు వెళ్లాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు తెలుస్తోంది. అయితే అప్పటి వరకు ఎన్నికల కోడ్ లేనందున ఉమ్మడి జిల్లాలో పెండింగ్‌లో ఉన్న పనులతోపాటు, కొత్తగా అభివృద్ధి పనులను ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు.

- భువనగిరి టౌన్

•7లో..



బీజేపీ సంబురాలు



క్లాక్ టవర్ వద్ద సంబరాలు నిర్వహిస్తున్న బీజేపీ శ్రేణులు •8లో..



దేవరకొండ డిపో నుంచి తిరుపతికి బస్సును ప్రారంభిస్తున్న అసిస్టెంట్ మేనేజర్ సైదులు

దేవరకొండ నుంచి తిరుపతికి బస్సు సౌకర్యం

ప్రతీ రోజు ఉదయం 10 గంటలకు

ప్రారంభించిన అసిస్టెంట్ మేనేజర్

•8లో..



గుట్టలో హరిహరులకు విశేష పూజలు

•7లో..

ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

కలెక్టర్ దాసరి హరిచందన



ప్రజల నుంచి ఫిర్యాదులు తీసుకుంటున్న కలెక్టర్

నల్లగొండ టౌన్, జూన్ 10: 'ప్రజావాణి'లో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ దాసరి హరిచందన అధికారులను ఆదేశించారు. పార్లమెంటు ఎన్నికలు, వరంగల్-ఖమ్మం-నల్లగొండ శాసన మండలి పట్టభద్రుల ఉప ఎన్నిక కోడ్ ముగియడంతో సోమవారం నిర్వహించిన 'ప్రజావాణి'లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు తీసుకున్నారు. రెండున్నర నెలల తరువాత నిర్వహించిన 'ప్రజావాణి'కి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. వచ్చిన ఫిర్యాదులను పరిశీలించిన కలెక్టర్ జిల్లా అధికారులతో మాట్లాడి కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించారు. మిగతా వాటిని పరిశీలించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం అధికారులతో మాట్లాడుతూ జిల్లా కేంద్రంతో పాటు, డివిజన్, మండల స్థాయిలో వచ్చే దరఖాస్తులను సైతం పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ టి.పూర్ణచంద్ర, డీఆర్వో రాజ్యలక్ష్మి, పాల్గొన్నారు.

పండిట్లు, పీఈటీల సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి



సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న డీఈవో బి.భిక్షపతి, ఆర్డీవో రవి

నల్లగొండ, జూన్ 10: పండిట్లు, పీఈటీల అప్‌గ్రేడేషన్‌లో భాగంగా సోమవారం తెలుగు, హిందీ, ఉర్దూ పండిట్లు, పీఈటీల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పూర్తయింది. డీఈవో కార్యాలయంలో నాలుగు కౌంటర్లు ఏర్పాటు చేసి సర్వీస్ బుక్, ఒరిజినల్ సర్టిఫికెట్లను పరిశీలించారు. ఉదయం 10గంటలకు మొదలైన ఈ ప్రక్రియ సాయంత్రం వరకు కొనసాగింది. వెరిఫికేషన్‌కు ఉపాధ్యాయులంతా ఒకేసారి రావడంతో గంటల తరబడి క్యూలో నిల్చున్నారు. ఓ వైపు ఉక్కపోత, కనీస సౌకర్యాలు కల్పించకపోవడంతో ఉపాధ్యాయులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాలో 190 తెలుగు పండిట్ పోస్టులకు 174మంది సర్వీస్ బుక్‌లు, సర్టిఫికెట్లను పరిశీలించారు. 149 హిందీ పండిట్ పోస్టులకు 144మంది, ఉర్దూ విభాగంలో ఎనిమిది పోస్టులకు ఏడుగురి సర్టిఫికెట్లను పరిశీలించారు. ఇదిలా ఉండగా, అప్‌గ్రేడ్ అయిన పోస్టులకు సరిపడా పండిట్‌లు లేరు. ఫలితంగా 2018లో సర్వీస్‌లోకి వచ్చిన లాంగ్వేజీ పండిట్లు సైతం స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి పొందుతుండటం గమనార్హం.

ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి

ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



వేములపల్లి మండల కేంద్రంలో పోలీసు, ఎన్‌హెచ్‌ఏ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

వేములపల్లి, జూన్ 10: నార్కట్‌పల్లి-అద్దంకి రహదారిపై ప్రమాదాల నివారణకు ప్రణాళికలు రూపొందించి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అధికారులకు సూచించారు. సోమవారం నార్కట్‌పల్లి-అద్దంకి రహదారిపై బ్లాక్‌స్పాట్లుగా ఉన్న వేములపల్లి మండలకేంద్రం, శెట్టిపాలెం, అన్నపరెడ్డిగూడెం జంక్షన్లను ఎన్‌హెచ్‌ఏఐ, ఆర్‌అండ్‌బీ, పోలీసు అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నార్కట్‌పల్లి-అద్దంకి రహదారిపై రోజురోజుకూ వాహనాల రద్దీ పెరగడంతోపాటు నిత్యం ప్రమాదాలు చోటుచేసుకొని ప్రజలు మృత్యువాతపడటంతోపాటు పలువురు క్షతగాత్రులుగా మారుతున్నారన్నారు. అధికారులు సమన్వయంతో ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. అందుకు విధివిధానాలను రూపొందించి అమలు చేయాలన్నారు. ఆయన వెంట డీఎస్పీ రాజశేఖర్‌రాజు, ఎన్‌హెచ్‌ఏ అధికారులు ఉన్నారు.

బడి ఊడ్చేదెవరో?

వేసవి సెలవులు మంగళవారంతో ముగిసి 12వ తేదీన పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. ఎప్పటిలాగే సమస్యలతో పాఠశాలలు స్వాగతం పలుకుతున్నాయి. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో బడులకు కొత్త సొబగులు దిద్దుతున్నా పారిశుధ్య పనుల నిర్వహణ ఎలా అనేది ప్రశ్నార్థకంగా మారింది. పాఠశాలలను ఊడ్చేదెవరో? మరుగుదొడ్లను శుభ్రం చేసేదెవరో? అర్థంకాని పరిస్థితి. వసతుల కల్పనలో భాగంగా పాఠశాలల్లో పారిశుధ్యం విషయంలో గత ప్రభుత్వ విధానాన్నే ప్రస్తుత ప్రభుత్వం కొనసాగిస్తుందా? లేదా? అనే విషయం ఉపాధ్యాయుల్లో చర్చనీయాంశమైంది.

- నార్కట్‌పల్లి



- రేపటి నుంచి పునఃప్రారంభం కానున్న పాఠశాలలు
- స్కావెంజర్లను తీసేసిన గత ప్రభుత్వం
- పంచాయతీ పారిశుధ్య కార్మికులతో నిర్వహణ
- అరకొరగా నిర్వహణతో అపరిశుభ్రత
- కొన్ని చోట్ల ఉపాధి కూలీ డబ్బులతో నిర్వహణ
- మరికొన్ని చోట్ల సొంత డబ్బులు వెచ్చిస్తున్న హెచ్ఎంలు

గతంలో మరుగుదొడ్లు, పాఠశాల పారిశుధ్యం పనుల నిర్వహణకు ప్రత్యేకంగా స్కావెంజర్ల వ్యవస్థ ఉండేది. తాత్కాలిక వేతనంతో వీరిని నియమించేవారు. విద్యార్థుల సంఖ్య 100లోపు ఉంటే ఒక స్కావెంజర్, 100 దాటితే ఇద్దరిని నియమించారు. అందుకు స్కావెంజర్లకు నెలకు ప్రాథమిక పాఠశాలల్లో రూ.2,000లు,ఉన్నత పాఠశాలల్లో రూ.2,500లు వేతనంగా మండల విద్యాధికారి ద్వారా చెల్లించేవారు. కాగా, రెండేళ్ల కిందట అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం పాఠశాలల్లో స్కావెంజర్ల వ్యవస్థను తీసేసింది. పాఠశాలల్లో పారిశుధ్య నిర్వహణ బాధ్యతలను గ్రామ పంచాయతీలకు, పట్టణాల్లో మునిసిపాలిటీకి అప్పజెప్పింది. పాఠశాలల గదులతో పాటు మరుగుదొడ్ల నిర్వహణ బాధ్యత కూడా పంచాయతీ పారిశుధ్య సిబ్బందిదే. అయితే సరిపడా సిబ్బంది లేక గ్రామాలు, పట్టణాల్లో పారిశుధ్య నిర్వహణ అంతంత మాత్రంగా ఉన్న పరిస్థితుల్లో పాఠశాలల నిర్వహణ బాధ్యత అదనంగా మారింది. దీంతో వారు పాఠశాలల వైపు చూడటం మానేశారు. ఫలితంగా పాఠశాలల్లో పారిశుధ్య పనుల నిర్వహణ అధ్వానంగా మారింది. దీంతో కొందరు ఉపాధ్యాయులు సొంత డబ్బు వెచ్చించి స్కావెంజర్లను ఏర్పాటు చేసుకోగా, మరికొన్ని పాఠశాలల్లో స్కావెంజర్ల వేతనాన్ని ఉపాధి హామీ పథకం కింద ఇచ్చేలా అనధికారిక అవగాహన చేసుకున్నారు. అయితే ప్రస్తుతం పాఠశాలలు పునఃప్రారంభం కానున్నందున పారిశుధ్య పనుల నిర్వహణ ఎలా అని ఉపాధ్యాయులు ప్రశ్నిస్తున్నారు.

జిల్లాలో 1,483 పాఠశాలలు

జిల్లాలో మొత్తం 1,483 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 1,126 ప్రాథమిక, 128 ప్రాథమికోన్నత, 229 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలల్లో మొత్తం 93వేలకు పైగా విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. వీరిలో 54వేల మందికిపైగా బాలికలే ఉన్నారు. అయితే మౌలిక వసతుల కల్పనలో భాగంగా ప్రతీ పాఠశాలలో మూత్రశాలలు, మరుగుదొడ్లను నిర్మించారు. నీటి వసతి కోసం గ్రామ పంచాయతీల ద్వారా నల్లా కనెక్షన్ ఇచ్చారు.



నార్కట్‌పల్లి మండలంలోని ఓ పాఠశాలలోని మరుగుదొడ్లు

స్కావెంజర్లను నియమించాలి



పాఠశాలల్లో పారిశుధ్య పనులను నిర్వహించే స్కావెంజర్ల వ్యవస్థను గత ప్రభుత్వం రద్దు చేసింది. ఇది సరైంది కాదు. పాఠశాలల నిర్వహణను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయొద్దు. స్కావెంజర్ల వ్యవస్థను తిరిగి ప్రవేశపెట్టాలి. పంచాయతీ కార్మికులకు అదనపు భారంగా మారిన పాఠశాలల పారిశుధ్య బాధ్యతలను రద్దు చేయాలి. దీనిపై ప్రస్తుత ప్రభుత్వం పునరాలోచన చేయాలి.

- గోపీనాథ్, ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి

ప్రభుత్వం హామీని నెరవేర్చాలి



పాఠశాలల్లో స్కావెంజర్ల వ్యవస్థను ప్రభుత్వం పునరుద్ధరించి స్వచ్ఛ పాఠశాలలకు సహకరించాలి. ఇక్కడి పారిశుధ్య నిర్వహణ బాధ్యతలను పంచాయతీలకు అప్పజెప్పడం సరైంది కాదు. ఈ విషయాన్ని కొత్తగా ఏర్పడిన ప్రభుత్వంతో ఉపాధ్యాయ సంఘాల నేతలు చర్చించినప్పుడు అందుకు హామీ ఇచ్చింది. పాఠశాలలు పునఃప్రారంభమవుతున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ విషయంలో త్వరగా ప్రకటన చేయాలి.

- శేఖర్‌రెడ్డి, యూటీఎఫ్ జిల్లా కోశాధికారి

పంచాయతీ సిబ్బందితోనే..



పాఠశాలల్లో పారిశుధ్య పనుల నిర్వహణకు సంబంధించి గతంలో ఉన్న మార్గదర్శకాలనే పాటించనున్నాం. పంచాయతీ ప్రత్యేక అధికారులను కలిసి పాఠశాలల శుభ్రం కోసం సిబ్బందిని పంపించేలా విజ్ఞప్తి చేయాలని హెచ్ఎంలకు సూచించాం. స్కావెంజర్ల వ్యవస్థ పునరుద్ధరణపై మాకు ఎలాంటి సమాచారం లేదు.

- కూకుట్ల నర్సింహ, నార్కట్‌పల్లి ఎంఈవో

బదిలీలను పారదర్శకంగా నిర్వహించాలి



ఆస్పత్రి ఎదుట ఆందోళన నిర్వహిస్తున్న సిబ్బంది

నాగార్జునసాగర్,జూన్ 10: వైద్యశాఖలో బదిలీల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని ఆస్పత్రి సిబ్బంది డిమాండ్ చేశారు. సోమవారం సాగర్ హిల్‌కాలనీ కమలా నెహ్రూ ఏరియా ఆస్పత్రి సిబ్బంది ఆస్పత్రి ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పదేళ్లుగా సాగర్ కమలా నెహ్రూ ఏరియా ఆస్పత్రిలో తిష్టవేసి ఉన్న వైద్యులతో పాటు సిబ్బందిని వెంటనే బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. రెండేళ్లకు మించి గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న వైద్యులకు బదిలీల్లో అవకాశం కల్పించాలని కోరారు. బదిలీల ప్రక్రియకు మార్గదర్శకాలు రూపొందించి సజావుగా సాగేలా చూడాలని కోరారు. పదోన్నతులను బదిలీల అనంతరమే చేపట్టాలన్నారు. అనంతరం ఆస్పత్రి సీఎంవో డాక్టర్ భానుప్రసాద్‌నాయక్‌కు వినతిపత్రం అందజేశారు.

మంచినీటి సరఫరాలో నిర్లక్ష్యం చేయవద్దు

మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మునిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి

నల్లగొండ, జూన్ 10: మంచినీటి సరఫరాలో ఏ మాత్రం నిర్లక్ష్యం వహించినా చర్యలు తప్పవని మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి హెచ్చరించారు. సోమవారం స్థానిక మునిసిపల్ కార్యాలయంలో మంచినీటి సరఫరా విభాగ సిబ్బందితో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. మంచినీటి ట్యాంకులను ప్రతీ రోజు శుభ్రం చేయాలని, తగిన మోతాదులో క్లోరిన్ ఉండేలా చూసుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా పైపులైన్లలో మురుగునీరు కలవకుండా చూడాలన్నారు. విద్యుత్ అంతరాయం ఏర్పడితే జనరేటర్లను అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. నీటి పన్ను బకాయిలు చెల్లించి పట్టణ అభివృద్ధికి ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో మునిసిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్, డీఈ అశోక్, ఏఈ దిలీప్‌భార్గవ్ పాల్గొన్నారు.

హరిహరులకు విశేష పూజలు

నిత్య ఆదాయం రూ.31.77లక్షలు

భువనగిరి అర్బన్, జూన్ 10: యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి కొండపై హరిహరులకు సోమవారం విశేష పూజలు కొనసాగాయి. స్వయంభూ స్వామి, అమ్మవారికి శ్రీవైష్ణవ పాంచరాత్రాగమరీతిలో, అనుబంధ ఆలయం పర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామికి, శివాలయంలో స్ఫటికమూర్తులకు శైవాగమ శాస్త్రరీతిలో నిత్య కైంకర్యాలు నిర్వహించారు. ప్రధానాలయంలో సుప్రభాత సేవతో స్వామిఅమ్మవార్లను మేల్కొలిపిన అర్చకస్వాములు మూలమూర్తులను వేద మంత్ర పఠనాలు, పంచామృతాలతో అభిషేకించి, తులసీ దళాలతో అర్చించారు. అష్టభుజి ప్రాకార మండపంలో ఉత్సవమూర్తులను దివ్యమనోహరంగా అలంకరించిన పూజారులు విశ్వక్సేనుడికి తొలి పూజలు చేపట్టి సుదర్శన హోమం, నిత్య కల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం వేళ అలంకార వెండి జోడు సేవలు, సహస్రనామార్చనలు ఆగమశాస్త్రరీతిలో కొనసాగాయి. శివాలయంలోని ముఖమండపంలో స్ఫటికమూర్తును అర్చకులు వేదమంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల మధ్య పంచామృతాలతో అభిషేకించారు. శివపార్వతుల ఉత్సవమూర్తులకు పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించి తిరువీధుల్లో ఊరేగించారు. 15వేల మంది భక్తులు లక్ష్మీనృసింహుడిని దర్శించుకోగా, వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ.31,77,476 ఆదాయం సమకూరినట్లు ఈవో ఏ. భాస్కర్‌రావు తెలిపారు.



లక్ష్మీ నృసింహుడికి నిత్య పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు

ముగిసిన క్రీడా శిక్షణ

మిర్యాలగూడ టౌన్, జూన్ 10: నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని క్లియో స్పోర్ట్స్ అకాడమీలో నిర్వహించిన వేసవి శిక్షణ ముగిసింది. నిర్వాహకులు హర్ష ఏచూరి మాట్లాడుతూ విద్యార్థులు సెలవులలో క్రీడా సాధన చేయాలని సూచించారు. క్రీడలు మానసిక, శారీరక ఆరోగ్యాన్నిస్తాయన్నారు. 45రోజులు పాటు ఇచ్చిన శిక్షణలో పట్టణ, పరిసర ప్రాంత విద్యార్థులు పలు విభాగాలలో తర్ఫీదు పొందడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో బ్యాడ్మింటన్ జిల్లా కోచ్ మారబోయిన రామకృష్ణ పాల్గొన్నారు.

కోడ్ ముగిసె.. ఆశలు చిగురించే

● 245 రోజుల్లో 144 రోజులూ ఎన్నికల కోడ్లు ● అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు పట్టాలెక్కేనా..? ● మరో మూడు ఎన్నికల కోడ్లు వచ్చే అవకాశం



ఎన్నికల కోడ్ ముగియడంతో నల్లగొండలో నిర్వహించిన ప్రజావాణికి హాజరైన ప్రజలు

భువనగిరి టౌన్, జూన్ 10: పార్లమెంట్, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిసింది. ఎన్నికల షెడ్యూల్స్ వెలువడినప్పటి నుంచి అమల్లోకి వచ్చిన ఎన్నికల కోడ్ 86రోజుల అనంతరం ఆదివారంతో ఉమ్మడి జిల్లాలో ముగిసింది. దీంతో ప్రభుత్వ అభివృద్ధి పనులకు అడ్డంకి తొలగింది. ప్రభుత్వ పథకాల అర్హులైన లబ్ధిదారుల్లో ఆశలు పెరిగాయి. అసెంబ్లీ, పార్లమెంట్, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో వరుసగా మూడు ఎన్నికల కోడ్‌లు రాగా త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికల పేరిట మరో మూడు ఎన్నికల కోడ్‌లు వచ్చే అవకాశాలు ఉన్నాయి. దీంతో ప్రతిపాదిత అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను త్వరలోనే పట్టాలు ఎక్కించాల్సిన బాధ్యత ప్రభుత్వం, అధికారులపై ఉన్నది.

వరుసగా ఎన్నికల కోడ్లు

245 రోజుల్లో మూడు దఫాలుగా 144 రోజులు ఎన్నికల కోడ్ అమల్లో ఉంది. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ వెలువడిన 2023 అక్టోబరు 9వ తేదీ నుంచి కౌంటింగ్ పూర్తయిన రెండు రోజులు వరకు అనగా 2023 డిసెంబరు 5వ తేదీ వరకు 58రోజులు ఎన్నికల కోడ్ అమల్లో ఉంది. తిరిగి లోక్‌సభ ఎన్నికల కోడ్ 16 మార్చి 2024న వెలువడిన పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్‌తో అమల్లోకి వచ్చిన ఎన్నికల కోడ్ 2024 జూన్ 6వ తేదీతో దేశమంతటా ముగిసినా 25ఏప్రిల్ నుంచి అమలులోకి వచ్చిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ మాత్రం ఉమ్మడి నల్లగొండ-వరంగల్-ఖమ్మం జిల్లాలో ఈ నెల 9తో ముగిసింది. దీంతో రాష్ట్రంలోని మిగితా ఏడు ఉమ్మడి జిల్లాలతో పోలిస్తే ఆ మూడు ఉమ్మడి జిల్లాలో మరో నాలుగు రోజులు ఎన్నికల కోడ్ అదనంగా అమలులో ఉండడంతో వరుసగా 86 రోజల పాటు ఎన్నికల కోడ్ అమలైంది. అలాగే సర్పంచుల పదవీ కాలం 2024 జనవరితో ముగిసినా ప్రభుత్వం తిరిగి ఎన్నికలు నిర్వహించలేదు. ఎంపీటీసీ, జడ్పీటీసీల పదవీకాలం కూడా జూలైతో ముగియనుంది. ప్రస్తుత మునిసిపల్ కౌన్సిళ్ల గడువు 2025 జనవరితో ముగియనుంది. దీంతో రానున్న ఏడు నెలల వ్యవధిలో మరో మూడు సార్లు ఎన్నికల కోడ్ వచ్చే అవకాశాలు ఉన్నాయి. దీంతో ముగిసిన పార్లమెంట్ ఎన్నికల కోడ్, త్వరలో రానున్న మూడు స్థానిక సంస్థల ఎన్నికల మధ్య ఉన్న స్వల్ప వ్యవధిలోనే ప్రతిపాదిత అభివృద్ధి పనులను, సంక్షేమ పథకాలను ప్రభుత్వం, అధికారులు అమలు చేయాల్సి ఉంది.

ఏఎంసీ పాలకవర్గాల నియామకాలకు గ్రీన్ సిగ్నల్

చౌటుప్పల్ టౌన్: పార్లమెంట్ ఎన్నికల కోడ్ ముగియడంతో రాష్ట్రంలో ఏఎంసీ పాలకవర్గాలను నియమించే ప్రక్రియకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దీంతో చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ పాలకవర్గం నియామకంపై కాంగ్రెస్‌లోని ఆశావాహుల్లో ఉత్కంఠ నెలకొంది. ఎస్సీ జనరల్ కేటగిరికి కేటాయించిన చైర్మన్ పదవి కోసం ఆరుగురు నాయకులు పోటీ పడుతున్నారు. కాంగ్రెస్ పార్టీ కోసం శ్రమిస్తున్న వారికే చైర్మన్ పదవి కేటాయించి న్యాయం చేయాలని, తరుచూ పార్టీలు మారే నాయకులను దూరం పెట్టాలని కార్యకర్తల నుంచి డిమాండ్ పెరుగుతోంది. పార్లమెంట్ ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే మంచిర్యాల జిల్లాలో మూడు వ్యవసాయ మార్కెట్ పాలకవర్గాలను ఈ నెల 7న రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడంతో ఆశావాహుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

ఎదురు చూస్తున్న లబ్ధిదారులు

రూ.100కోట్లతో చేపట్టనున్న భువనగిరి ఖిల్లా అభివృద్ధి పనులకు పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ వెలువడే కొన్ని రోజుల ముందే ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు. ఆ వెంటనే అమల్లోకి వచ్చిన ఎన్నికల షెడ్యూల్‌తో ప్రతిపాదిత పనులు ప్రారంభం కాలేదు. అలాగే పదేళ్లుగా నిలిచిన నల్లగొండలోని ఎస్ఎల్‌బీసీ టన్నెల్ చివరి విడత పనులను ప్రభుత్వం పూర్తి చేయాలని సంకల్పించినప్పటికీ ఎన్నికల కోడ్ అడ్డంకిగా మారిందని ప్రచారం జరిగింది. దీంతో ఎన్నికల కోడ్ ముగిసినందున ఉమ్మడి జిల్లాలో ప్రతిపాదించిన అభివృద్ధి పనులు చేపట్టడానికి మార్గం సుగమమైంది. ఆరు గ్యారంటీ పథకాలపై ప్రజాపాలనలో దరఖాస్తులు స్వీకరించినప్పటికీ పలు కారణాలతో పలు దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయి. ఈ మేరకు అప్పట్లోనే వచ్చిన నిరసనలతో ప్రభుత్వం తిరిగి దరఖాస్తులకు అవకాశం కల్పించినప్పటికీ పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో గృహజ్యోతి తదితర పథకాల లబ్ధి దరఖాస్తుల స్వీకరణ అర్థాంతరంగా నిలిచిపోయింది. ఎన్నికల కోడ్ ముగిసినందున ప్రభుత్వ ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ ప్రారంభమైంది. త్వరలోనే మిగితా శాఖల్లో కూడా బదిలీలు, పదోన్నతులు ప్రారంభం కానున్నాయి. ఎన్నికల కోడ్ ముగిసినందున ఆరు గ్యారంటీ పథకాలతో ఇచ్చిన ఎన్నికల హామీలన్నింటినీ ప్రభుత్వం నెరవేరుస్తుందని అర్హులు ఆశాభావంతో ఉన్నారు. అలాగే పనులు నిమిత్తం నాయకుల వద్దకు, ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్తున్న ప్రజలకు నాయకులు, అధికారులు ఎన్నికల కోడ్ సాకు చూపుతూ పనులు వాయిదా వేస్తూ వచ్చారు. కానీ ఎన్నికల కోడ్ ముగిసినందున సాకులు చెప్పి తప్పించుకునే అవకాశం నాయకులకు, అధికారులకు చేజారి తప్పనిసరిగా పనులను చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

సాగర్ సమాచారం	
పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం	504.70 అడుగులు
ఎడమకాల్వకు నీటి విడుదల	నిల్
కుడికాల్వకు	నిల్
విద్యుత్ కేంద్రం ద్వారా	నిల్
సాగర్‌కు నీటి రాక	నిల్
ఎస్ఎల్‌బీసీ ద్వారా	800 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	800
శ్రీశైలం నీటిమట్టం	809.00 అడుగులు

\- నాగార్జునసాగర్

పులిచింతల ప్రాజెక్టు	
పూర్తిస్థాయి నీటి నిల్వ	45.77 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	0.71 టీఎంసీలు
పులిచింతలకు నీటి రాక	నిల్
నీటి విడుదల	నిల్

\- మేళ్లచెర్వు

మూసీ నీటిమట్టం	
పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం	636.76 అడుగులు
మూసీకి నీటి రాక	534 క్యూసెక్కులు
నీటి విడుదల	నిల్

\- కేతేపల్లి

కారు, బైక్ ఢీ.. ఒకరికి గాయాలు

మఠంపల్లి, జూన్ 10: కారు, ద్విచక్ర వాహనం ఢీకొని ఒకరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండల కేంద్రంలోని మట్టపల్లి-హుజూర్‌నగర్ ప్రధాన రహదారిపై జరిగింది. పెదవీడు గ్రామానికి చెందిన షేక్ మహమ్మద్ ద్విచక్ర వాహనంపై మఠంపల్లికి వస్తుండగా మఠంపల్లి నుంచి పెదవీడు వైపునకు వెళ్తున్న టాటా సుమో ఢీకొంది. దీంతో షేక్ మహమ్మద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 సిబ్బందికి సమాచారం ఇచ్చారు. పైలెట్ శ్రీనివాస్, ఈఎంటీ ప్రవీణ్ సంఘటనా స్థలాన్ని చేరుకొని క్షతగాత్రుడిని హుజూర్‌నగర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కుటుంబ సభ్యులు ఖమ్మం తరలించినట్లు 108 సిబ్బంది తెలిపారు.

ఆవుల డీసీఎం పట్టివేత

చౌటుప్పల్ రూరల్ జూన్ 10: యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌గేటు వద్ద ఆవుల డీసీఎంను సోమవారం పోలీసులు పట్టుకున్నారు. ఆంధ్రప్రదేశ్ కృష్ణా జిల్లా నుంచి 72ఆవుల లోడుతో డీసీఎం హైదరాబాద్‌కు వెళ్తుంది. సమాచారం అందుకున్న పోలీసులు డీసీఎంను పట్టుకున్నారు. ఆవులను హైదరాబాద్ గోశాలకు పంపించారు. డ్రైవర్ నూనవత్ కృష్ణాను అదుపులోకి తీసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

ఇంట్లో చోరీ.. రూ.90వేల నగదు అపహరణ

మాడ్గులపల్లి, జూన్ 10: తాళం వేసిన ఇంట్లో దొంగలు చొరబడి రూ.90వేల నగదు అపహరించారు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలకేంద్రంలో ఆదివారం జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం మండలకేంద్రానికి చెందిన ఆరూరి నరేష్ ఆదివారం ఉదయం కుటుంబసభ్యులతో కలిసి తన బంధువుల ఇంటికి వెళ్లారు. అదేరోజు సాయంత్రం నరేష్ కూతురు ఇంటికి వచ్చి చూడగా గేట్ తాళంతోపాటు ఇంటితాళం పగులగొట్టి ఉండడాన్ని గమనించి వెంటనే తన తండ్రి నరేష్‌కు సమాచారం అందించింది. అక్కడికి చేరుకున్న నరేష్ ఇంట్లోకి వెళ్లి గమనించగా బీరువాలోని రూ.90వేల నగదు చోరికి గురైనట్లు గుర్తించి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఫొటోగ్రాఫర్ ఆత్మహత్య కేసులో నలుగురు అరెస్టు

● వివాహేతర సంబంధాన్ని ప్రశ్నించినందుకు దాడి ● భార్య వ్యవహారంతో విసుగు చెంది బలవన్మరణం

హుజూర్‌నగర్, జూన్ 10: 'సారీ తమ్ముడు చచ్చిపోతున్నా' నంటూ సెల్ఫీ వీడియో తీసిన ఫొటోగ్రాఫర్ రంజిత్ ఆత్మహత్య కేసులో నలుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. సోమవారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ చరమందరాజు, ఎస్ఐ ముత్తయ్యలు కేసు వివరాలను వెల్లడించారు. హుజూర్‌నగర్‌లోని పద్మశాలీ కాలనీకి చెందిన చిట్టిప్రోలు రంజిత్‌కుమార్(35) 14 సంవత్సరాల క్రితం మండల పరిధిలోని శ్రీనివాస్‌పురం గ్రామానికి చెందిన స్వప్నను ప్రేమించి కులాంతర వివాహం చేసుకోగా, వారికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. గత ఏడాది రంజిత్ భార్య స్వప్నకు సీతారాంనగర్ కాలనీలో రేషన్ డీలర్ షాపు రావడంతో ఆ కాలనీలో ఇంటిని అద్దెకు తీసుకొని రేషన్ దుకాణం నిర్వహిస్తోంది. రంజిత్‌కుమార్ ఫొటోగ్రాఫర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆరు నెలల క్రితం పట్టణానికే చెందిన మిట్టకోలు దుర్గాప్రసాద్‌తో స్వప్నకు పరిచయం ఏర్పడి వివాహేతర సంబంధానికి దారి తీసింది. రంజిత్‌కు తెలియకుండా కొద్దిరోజుల క్రితం దుర్గాప్రసాద్ స్వప్నను తిరుపతికి తీసుకెళ్లాడు. విషయం తెలుసుకున్న రంజిత్‌కుమార్ స్వప్నను పలుమార్లు హెచ్చరించినా ఎలాంటి మార్పు రాలేదు. దుర్గాప్రసాద్‌తో మరింత చనువు పెరగటంతో కుటుంబంలో ఘర్షణలు జరుగుతున్నాయి. కాగా వివాహేతర సంబంధంపై రంజిత్ స్వప్నను నిలదీస్తుండగా రెండు, మూడు సార్లు స్వప్న తల్లి రాచకొండ నాగమణి, ఆమె అన్న చంద్రశేఖర్, ప్రియుడు దుర్గాప్రసాద్ అనేకసార్లు రంజిత్‌ను కొట్టారు. దీంతో రంజిత్‌కుమార్ నెల రోజుల క్రితం తన చావుకు భార్య స్వప్న, ఆమె ప్రియుడు దుర్గాప్రసాద్, అత్త నాగమణి, బావమరిది చంద్రశేఖర్ కారణమని ఓ సెల్ఫీ వీడియో తీసుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న వారు 'వీడియో ఎందుకు తీసుకున్నావు' అని మరోసారి రంజిత్‌ను కొట్టి ఇంట్లో నుంచి వెళ్లగొట్టారు. దీంతో రంజిత్ మఠంపల్లిలోని తన చెల్లెలు భర్త బావ ఖుర్షీద్ రెస్టారెంట్‌లో పనిచేసుకుంటూ అక్కడే ఉంటున్నాడు. రంజిత్ తన కుమార్తెలను చూసేందుకు ఈ నెల 7న హుజూర్‌నగర్‌లోని సీతారాంనగర్ కాలనీలో తన భార్య నివసించే ఇంటికి వచ్చాడు. ఆ రోజు భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. అదే రోజు స్వప్న హుజూర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో రంజిత్‌పై ఫిర్యాదు చేయటంతో కేసు నమోదైంది. ఈ నెల 8వ తేదీన సీతారాంనగర్‌లోని ఇంటి నుంచి దుర్వాసన వస్తుండటంతో స్థానికులు గమనించి రంజిత్‌కుమార్ కుటుంబసభ్యులకు సమాచారమిచ్చారు. వారు వచ్చి చూడగా ఫ్యాన్‌కు ఉరి వేసుకుని కుమారుడు విగతజీవిగా కనిపించాడు. తన కుమారుడు రంజిత్‌ను, భార్య స్వప్న, ఆమె తల్లి నాగమణి, అన్న చంద్రశేఖర్, ఆమె ప్రియుడు మిట్టకోలు దుర్గాప్రసాద్ కలిసి మానసికంగా, శారీరంగా వేధించడంతో ఆత్మహత్య చేసుకున్నాడని రంజిత్ తల్లి పద్మ ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు స్వప్న, ప్రియుడు దుర్గాప్రసాద్, అత్త నాగమణి, అన్న చంద్రశేఖర్‌లను అరెస్టు చేసి రిమాండ్ చేసినట్లు సీఐ తెలిపారు. తండ్రి చనిపోవడం, తల్లి జైలుకు వెళ్లడంతో రంజిత్ ఇద్దరు పిల్లలు ఒంటరి వారయ్యారు. మన కుటుంబాల్లో ఇలాంటి వాళ్లు ఉండొద్దు. ఎంతకైనా పోరాడు, వదలొద్దు".. అంటూ భార్య వ్యవహారంతో విసుగుచెందిన భర్త సెల్ఫీవీడియో సూర్యాపేట జిల్లాలో సంచలనంగా మారింది.



కేసు వివరాలు వెల్లడిస్తున్న హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు

విద్యుత్ తీగలు తగిలి ట్రాక్టర్ డ్రైవర్ మృతి

గుర్రంపోడు, జూన్ 10: ట్రాక్టర్ దున్నుతుండగా విద్యుత్ తీగలు తగిలి యువకుడు మృతిచెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా సోమవారం రాత్రి మండలంలోని కొత్తలాపురం గ్రామంలో జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చామకూరి సందీప్(22) ఇదే గ్రామానికి చెందిన భాస్కర్ అనే రైతు తోటలో ట్రాక్టర్‌తో దున్నుతుండగా వేలాడుతున్న విద్యుత్ తీగ తగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని దేవరకొండ ఆసుపత్రికి తరలించారు.



బావిలో పడి మేకల కాపరి మృతి

మోతె, జూన్ 10 : మేకలు కాస్తు మంచినీటి కోసం వెళ్లి బావిలో పడి మేకల కాపరి మృతిచెందాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా మోతె మండల పరిధిలోని సిరికొండలో సోమవారం జరిగింది. ఎస్ఐ యాదవేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కట్టెబోయిన సోమయ్య లింగయ్య(28) రోజుమాదిరిగానే మేకలను తోలుకుని గ్రామశివారులో మేకలను మేపుతున్నాడు. మధ్యాహ్నం భోజనం చేసేందుకు సమీపంలో ఉన్న పెద్ద బావిలో మంచినీరు తాగేందుకు దిగడంతో కాలు జారి బావిలో పడిపోయాడు. ఈత రాకపోవడం, కొద్దిగా మందమరుపు ఉండడంతో కేకలు వేయలేక బావిలోనే మృతి చెందాడు. చుట్టుపక్కల వారు మేకల వద్ద ఎవరూ లేకపోవడంతో బావి వద్ద చూడగా అందులో మృతిచెందాడు. స్థానికుల సహాయంతో పోలీసులు బావిలో దిగి మృతదేహాన్ని బయటకు తీశారు.

గ్యాస్‌లీకై ఇల్లు దగ్ధం

మోతె, జూన్ 10 : గ్యాస్‌లీకై ఇల్లు మంటల్లో పూర్తిగా దగ్ధమైన సంఘటన సూర్యాపేట జిల్లా మోతె మండల పరిధిలోని అన్నారిగూడెంలో సోమవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన పడిశాల సువార్త ఇంట్లో గ్యాస్ లీకై మంటలు లేచి ఇంట్లో ఉన్న బియ్యం బస్తాలు, వంటసామాగ్రి పూర్తిగా దగ్ధమైనవి సుమారు రూ. 50వేల ఆస్తినష్టం జరిగినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో...

నూతన్‌కల్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మండల దిర్శనపల్లి గ్రామ శివారులో సోమవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని ఎర్రపహాడ్ గ్రామానికి చెందిన అనంతుల ఆంజనేయులు తుంగతుర్తి వ్యవసాయ మార్కెట్ పరిధిలోని చిననేమిల క్రాస్ రోడ్ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ వద్ద విధులు నిర్వహిస్తున్నాడు. రోజు వారిగానే విధులకు వెళ్లాడు. దిర్శనపల్లి సబ్‌స్టేషన్ వద్ద వెనుక నుండి గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో కింద పడడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి.

ఉద్యమకారులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

కనగల్, జూన్ 10: తెలంగాణ ఉద్యమకారులకు ఎన్నికల ముందు సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని తెలంగాణ ఉద్యమకారులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. నల్లగొండ జిల్లా కనగల్ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పలువురు ఉద్యమకారులు ఎంపీడీవోకు సోమవారం వినతిపత్రం అం దజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్ని కల్లో సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని కోరారు. ప్రతి ఉద్యమకారుడికీ గుర్తింపుకార్డు, గౌరవ వేతనంగా నెలకు రూ.30వేలు, ప్రభుత్వ పథకాల్లో తగిన ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అదేవిధంగా ఉచిత బస్సు, రైల్వే పాసులు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులు దాసరి వెంకన్న, అద్దంకి రవీందర్, ఎర్రమాద ప్రభాకర్‌రెడ్డి, ఐతగోని లక్ష్మయ్యగౌడ్, వడ్డెబోయిన సైదులు తదితరులు పాల్గొన్నారు.

● పులిచింతలకు నీటి చింత



సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండలంలో పులిచింతల ప్రాజెక్టు నీరు లేక వెలవెలబోతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి 45.77 టీఎంసీలు. కాగా.. ప్రస్తుతానికి ఒక్క టీఎంసీ కూడా ప్రాజెక్టులో నిల్వ లేదు. ప్రస్తుతం 0.71 టీఎంసీలు మాత్రమే నీటి లభ్యత ఉంది. పులిచింతల ప్రాజెక్టుకు ప్రధానంగా కృష్ణానది వరద పై ఆధారపడగా ఎగువ ప్రాజెక్టులు నిండగా, కృష్ణానదికి గత సంవత్సరం కూడా నీటి లభ్యత లభించలేదు. నాగార్జునసాగర్ దిగువభాగాన ఉన్న తెలంగాణలోని మూసీ నదితో పాటు ఆంధ్రా ప్రాంతం నుంచి వచ్చే చిన్నపాటి వాగులు, వంకలతోనే ప్రాజెక్టు నీటి లభ్యత సమకూరుతుంది. ● మేళ్లచెర్వు

'ప్రజావాణి' అర్జీలు వెంటనే పరిష్కరించాలి

● ఉమ్మడి జిల్లాలో బాధితుల నుంచి దరఖాస్తుల వెల్లువ



ఫిర్యాదులు స్వీకరిస్తున్న యాదాద్రిభువనగిరి కలెక్టర్ జెండగే

భువనగిరి అర్బన్, జూన్ 10: ప్రజావాణి కార్యక్రమంలో బాధితుల నుంచి ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతు కే. జెండగే అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో రెవెన్యూ శాఖకు చెందినవి 30, మునిసిపల్ శాఖకు సంబంధించిన ఐదు, విద్యాశాఖ మూడు, పోలీసు, కార్మిక శాఖలకు చెందిన ఒక్కో దరఖాస్తు అందాయి. ప్రజావాణిలో అందిన ఫిర్యాదులు పరిష్కరించేందుకు అధికారులు చొరవ చూపాలని కలెక్టర్ ఆదేశించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి బాధితులు ప్రజావాణిలో ఫిర్యాదులు అందజేశారు. కార్య క్రమంలో డీఆర్డీవో ఎం.ఏ. క్రిష్ణన్, జడ్పీ సీఈవో శోభరాణీ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

- తన భర్త రెండో భార్యతో కలిసి గ్రామస్థుల తీర్మానానికి వ్యతిరేకంగా ఎకరం భూమి తనకు కాకుండా అడ్డుకుంటున్నాడని ఆత్మకూర్(ఎం) మండలం సారగండ్లగూడేనికి చెందిన పంగ సుశీల ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.
- యాదగిరిగుట్ట మండలంలోని పెద్దకందుకూరు పంచాయతీలో 20ఏళ్లు, ఎంపీటీసీకి 25ఏళ్లుగా ఎస్సీ రిజర్వేషన్ అవకాశం రాలేదని, దీంతో ఆ సామాజిక వర్గం రాజకీయంగా పూర్తిగా వెనకబడిపోయిందని గ్రామానికి చెందిన జి. ప్రకాశ్, జి. మధు, గుర్రం నర్సింహులు గడ్డం జహంగీర్ ఫిర్యాదు చేశారు.
- వృద్ధురాలినైన తనను పట్టించుకోకుండా రైల్వే పింఛన్ పుస్తకం, 11 తులాల బంగారం, నగదు తీసుకున్న అల్లుడు, అతని కూతుళ్లపై చర్యలు తీసుకోవాలని ఆలేరు మండలం శారాజీపేటకు చెందిన మల్లమ్మ ఫిర్యాదు చేశారు.
- తన పింఛన్‌ను పునరుద్ధరించాలని భూదాన్‌పోచంపల్లి మండలం పిల్లాయిపల్లికి చెందిన దివ్యాంగురాలు కలకొండ లక్ష్మీ ఫిర్యాదు చేశారు. తనకు ఉమ్మడి జిల్లాలో నిర్వహించిన సదరం క్యాంపు ద్వారా 77శాతం వైకల్యం ఉందని నిర్ధారించగా 2013 సెప్టెంబరు నెల వరకు పింఛన్ అందేదని, ఆ తర్వాత నిలిచిపోయిందని, దానిని పునరుద్ధరించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు.
- తన కుటుంబానికి ప్రాణహాని ఉందని బొమ్మలరామారం మండలం చీకటిమామిడికి చెందిన బూడిద అన్నపూర్ణ ఫిర్యాదు చేశారు. గతంలో తమ కుటుంబసభ్యులపై దాడి జరిగిందని, పోలీసులకు ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదని ప్రజావాణిలో మొరపెట్టుకున్నారు.

చందుపట్ల ఫీల్డ్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకోవాలి



సూర్యాపేట కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న ఉపాధి హామీ కూలీలు

సూర్యాపేట(కలెక్టరేట్): సూర్యాపేట జిల్లా చివ్వెంల మండల పరిధిలోని చందుపట్ల ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ రవిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహి ంచారు. గ్రామంలో ఉపాధి హామీ పనికి వెళ్లని వారికి హాజరు వేసి అక్రమంగా డబ్బులు తీసుకున్నాడని ఆరోపించారు. గ్రామంలో 200మందికి పైగా పనులు కల్పించాలని దరఖాస్తు చేసుకున్నా పనులు కల్పించడంలేదని ఆరోపించారు. అనంతరం ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ వెంకట్రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో చందుపట్ల అనంతుల ఎల్లయ్య, వినోద, వెంకటమ్మ, ఉపేందర్, సునీల్, వెంకన్న, రేణుక, సునీత, ఎల్లమ్మ ఉన్నారు.

బైపాస్ నిర్మాణానికి మూడో ప్రతిపాదన అశాస్త్రీయం

నల్లగొండ టౌన్: నల్లగొండ పట్టణంలో బైపాస్ రోడ్డు నిర్మాణానికి మూడో ప్రతిపాదన అశాస్త్రీయమైనదని, వెంటనే ఉపసంహరించుకోవాలని నిర్వాసితులు డిమాండ్ చేశారు. బైపాస్‌రోడ్డు బాధితుల సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట సోమవారం నిరసన తెలిపారు. అనంతరం 'ప్రజావాణి'లో కలెక్టర్ దాసరి హరిచందనకు వినతిపత్రం అందజేశారు. మూడో ప్రతిపాదిత రోడ్డుతో పట్టణంలోని పలు కాలనీలకు చెందిన సుమారు 2,730 కుటుంబాలపై ప్రతికూల ప్రభావం పడుతుందన్నారు. 196 ఇళ్లు పూర్తిగా కోల్పోవాల్సి వస్తోందన్నారు. మొదటి ప్రతిపాదన ప్రకారం రోడ్డు నిర్మిస్తే భూసేకరణ వ్యయం తగ్గుతుందని, ప్రభుత్వం, అధికారులు, ప్రజాప్రతినిధులు మొదటి ప్రతిపాదిత రోడ్డుకే ఆమోదం తెలపాలని కోరారు. కార్యక్రమంలో రాజేష్‌రెడ్డి, పెరిక జానయ్య, భిక్షం, యాదగిరిరెడ్డి, నర్సిరెడ్డి, నాగమణి, కవిత, స్వప్న, రజిత, విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ వైద్యులపై దాడులు ఆపాలి

నల్లగొండ టౌన్, జూన్ 10: గ్రామీణ వైద్యులపై దాడులను ఆపాలని సుశ్రుత గ్రామీణ వైద్యులు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. నల్లగొండ జిల్లా కలెక్టరేట్ ఎదుట ఆర్ఎంపీలు సోమవారం ధర్నా నిర్వహించారు. జిల్లాలో పనిచేస్తున్న గ్రామీణ వైద్యులు జీవో 1273, 428, 429 ప్రకారం కమ్యూనిటీ పారామెడిక్ కోర్సు ట్రైనింగ్ పూర్తిచేశారన్నారు. ఐఎంఏ డాక్టర్లు సైతం వెళ్లని మారుమూల గ్రామాల్లో సైతం వైద్య సేవలందిస్తున్నామన్నారు. అలాంటి గ్రామీణ వైద్యులపై ఎన్ఎంసీ, హెఆర్‌డీఏ టీజీఎంసీ కౌన్సిల్ నుంచి విజిలెన్స్ అధికారుల పేరుతో వచ్చి దాడులు నిర్వహించడం శోచనీయమన్నారు. అనంతరం ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు హన్మంతరావు, శ్రీనివాసరాజు, చారి, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శాలిగౌరారం: ఆర్ఎంపీలకు చట్టబద్ధత కల్పించాలని మండల కేంద్రంలో ఆర్ఎంపీలు రాస్తారోకో చేశారు. కార్యక్రమంలో గ్రామీణ వైద్యులు వీపూరి పారంకుశం, దునక వెంకన్న, బండారు ధనుంజయ, మాదు వెంకన్న, అశోకాచారి, దామెర్ల శ్రీనివాస్, జబ్బార్, దొనకొండ అంజయ్య, స్వామి, వీరాచారి పాల్గొన్నారు.



నల్లగొండ జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఆర్ఎంపీలు

సూచికబోర్డులు ఏర్పాటు చేయరూ...!



ఎటువంటి సూచికలు లేకుండా ఉన్న కొండమల్లేపల్లి చౌరస్తా

కొండమల్లేపల్లి: జడ్చర్ల - కోదాడ జాతీయ రహదారిపై ఉన్న కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని చౌరస్తా వద్ద ఆయా ప్రాంతాలకు వెళ్లే ఊళ్ల పేర్లు తెలుపుతూ సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు. హైదరాబాద్, నాగార్జునసాగర్, నల్లగొండ, దేవరకొండ ప్రాంతాలకు వెళ్లేందుకు నాలుగు కూడళ్ల చౌరస్తా అయిన కొండమల్లేపల్లి చౌరస్తా ప్రధాన కేంద్ర బిందువుగా ఉండటంతో ప్రయాణికులు గందరగోళానికి గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పేర్ల సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

తుప్పు పడుతున్న 'చెత్త' ట్రాక్టర్



ఎల్లారెడ్డిగూడెం గ్రామ పంచాయతీ మినీ చెత్త ట్రాక్టర్

నార్కట్‌పల్లి: మండలంలోని ఎల్లారెడ్డిగూడెం గ్రామ పంచాయతీకి చెందిన పాత మినీ 'చెత్త' ట్రాక్టర్ 'తుప్పు' పడుతోంది. తరుచూ మరమ్మతులకు వస్తుండటంతో నాలుగేళ్లకు పైగా నిరుపయోగంగా మారింది. దీంతో ఎండకు ఎండి వానకు తడిసి ట్రాక్టర్ తుప్పు పట్టిపోతుంది. పదేళ్ల క్రితం గ్రామంలో చెత్తను సేకరించేందుకు ఈ ట్రాక్టర్‌ను కొనుగోలు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రెండో పర్యాయం అధికారంలోకి వచ్చాక ప్రతీ గ్రామ పంచాయతీకో ట్రాక్టర్ అందజేసింది. దీంతో అప్పటికే మరమ్మతులకు గురవుతున్న మినీ ట్రాక్టర్‌ను నిరుపయోగంగా మారింది. దీంతో నాలుగేళ్లుగా మినీ ట్రాక్టర్ ప్రకృతి వైపరీత్యాలకు గురై పనికిరాకుండా పోయింది. ట్రాక్టర్‌లోని కొన్ని వస్తువులు చోరీకి గురయ్యాయి.

పార్కింగ్‌కు అడ్డాగా మార్కెట్ యార్డు



మార్కెట్ యార్డులో ప్రైవేట్ వాహనాల పార్కింగ్

కొండమల్లేపల్లి: కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు కార్లు, ఇతర వాహనాలు పార్కింగ్ చేసుకునేందుకు అడ్డాగా మారింది. వ్యవసాయ సంబంధ వ్యాపారాలకు వినియోగించుకోవాల్సిన మార్కెట్ యార్డును ఇలా ప్రైవేట్ వాహనాల పార్కింగ్‌కు ఉపయోగిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు పేర్కొంటున్నారు. ఇదిలా ఉంటే ఈ విషయమై వ్యవసాయ మార్కెట్ యార్డు సెక్రటరీ రామనాథ్‌రావు స్పందిస్తూ వాహనాలు పార్కింగ్ చేయకుండా తగిన చర్యలు తీసుకుంటామని అన్నారు.

బస్టాండ్ లేక ప్రయాణికుల ఇబ్బందులు



అంగడిపేట ఎక్స్ రోడ్డు వద్ద ఎండలోనే బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

పెద్దఅడిశర్లపల్లి: పీఏపల్లి మండల పరిధిలోని అంగడిపేట ఎక్స్‌రోడ్డులో బస్టాండ్ లేకపోవడంతో ప్రయాణికులకు ఇబ్బందులు పడుతున్నారు. ఎండొచ్చినా, వానొచ్చినా ప్రయాణికులు ఉండేందుకు షెల్టర్ లేక ఇబ్బందులు పడుతున్నారు. మండల ప్రజలు, ఇతర ప్రాంతాల వారు బస్సులు ఎక్కేందుకు అంగడిపేట ఎక్స్‌రోడ్డు వద్దకు రావాల్సిందే. ఇటీవల ఇక్కడ బస్టాండ్‌ను మెట్రో వాటర్ సప్లయ్ పైప్‌లైన్ కారణంగా తొలగించారు. మరల ఏర్పాటు చేయలేదు. కోదాడ- జడ్చర్ల జాతీయ రహదారిపై ప్రతీ స్టేజీ వద్ద బస్టాండ్ నిర్మించాల్సి ఉండగా మండల పరిధిలోని రోళ్లకల్లు వద్ద మాత్రమే నిర్మించారు. అంగడిపేట ఎక్స్‌రోడ్డు, ఘనపురం స్టేజీ, రంగారెడ్డిగూడెం స్టేజీల వద్ద బస్టాండ్ నిర్మాణాలు చేపట్టలేదు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

అధికారులు సమస్యలపై దృష్టి సారించాలి

● *ఎంపీపీ గండికోట రాజమణిహరికృష్ణ*



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రాజమణి

వేములపల్లి, జూన్ 10: ప్రత్యేక అధికారులు గ్రామాల్లో అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని ఎంపీపీ గండికోట రాజమణిహరికృష్ణ అన్నారు. మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో సోమవారం అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామాల్లో సర్పంచులు లేనందున ప్రత్యేక అధికారులు విధుల్లో నిర్లక్ష్యం చేయకుండా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు. అధికారులు ప్ర జలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఎంపీడీవో మున్నయ్య అధ్యక్షతన వహించిన ఈ సమావేశంలో పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలు విక్రయించాలి



ఫర్టిలైజర్స్ దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఏడీఏ నాగమణి

దామరచర్ల, జూన్ 10: రైతులకు నాణ్యమైన విత్తనాలను విక్రయించాలని, నాసిరకం విత్తనాలను అంటగట్టి మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఏడీఏ పోరెడ్డి నాగమణి హెచ్చరించారు. దామరచర్లలోని పలు ఫర్టిలైజర్ షాపులను సోమవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. విత్తన స్టాక్ రిజిస్టర్లు, రశీదులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రైతులు లైసెన్స్ డీలర్ల వద్ద మాత్రమే కొనుగోలు చేయాలన్నారు. రశీదులను పంట కాలం పూర్తయ్యే వరకు భద్రపరుచుకోవాలన్నారు. బీటీ-3 పత్తి విత్తనాలకు ప్రభుత్వ అనుమతి లేదని, ఆ విత్తనాలను విక్రయించినా, సాగు చేసినా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరైనా అలాంటి విత్తనాలను అమ్మితే తమకు సమాచారం అందించాలన్నారు. డీలర్లు అందరూ ఎరువుల విక్రయాలు ఈ పాస్ ద్వారా మాత్రమే చేయాలని అన్నారు. ఆమె వెంట ఏవో బి.కల్యాణ్‌చక్రవర్తి, ఏఈవో రమేష్ తదితరులు ఉన్నారు.

ప్రజలకు ఇచ్చిన హామీలను అమలుచేయాలి

మిర్యాలగూడ, జూన్ 10: ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఎంసీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వస్కుల మట్టయ్య అన్నారు. ఎంసీపీఐ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్‌కు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత టీఆర్ఎస్ ప్రభుత్వం పేదలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వడంలో విఫలమైందని, నిత్యావసరాల ధరల పెరుగుదలను అరికట్టలేకపోయిందని అన్నారు. ఆ సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకిచ్చిన మాటను నిలబెట్టుకోవాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో, కాలేజీల్లో కార్పొరేట్ స్థాయి విద్యను అందించాలన్నారు. ఉద్యోగ క్యాలెండర్‌ను ప్రకటించి ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని కోరారు. అర్హులైన పోడు రైతులకు పట్టాలు ఇవ్వాలన్నారు. అనంతరం తహసీల్దార్ హరిబాబుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంసీపీఐయూ జిల్లా నాయకులు భరత్, జ్యోతి, మోహన్‌నాయక్, అనూక్, ఆశీర్వాదం, సైదులు, నాగయ్య, సందీప్, గురవయ్య, లింగమ్మ, రమణ, రామకృష్ణ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మండలాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తా

● *ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్*



నేరేడుగొమ్ములో సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలునాయక్

చందంపేట, జూన్ 10: నేరేడుగొమ్ము మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. నేరేడుగొమ్ము మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో పాల్గొని మాట్లాడారు. మండల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసికట్టుగా పనిచేసి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలలోకి తీసుకెళ్లాలని తెలిపారు. ప్రతీ గ్రామంలో 24 గంటల విద్యుత్, వ్యవసాయ రంగంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సకాలంలో విత్తనాలు, ఎరువులు అందేలా చర్యలు చేపట్టాలని వ్యవసాయ అధికారులకు సూచించారు. మండల అభివృద్ధికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. సమావేశంలో ఎంపీపీ బిక్కునాయక్, వైస్‌ఎంపీపీ సరోజ, జడ్పీటీసీ బాలునాయక్, ఎంపీడీవో సరోజ, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

మరమ్మతు పనులు త్వరగా పూర్తి చేయాలి

ప్రభుత్వ పాఠశాలల్లో తరగతి గదుల మరమ్మతు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే బాలునాయక్ అన్నారు. నేరేడుగొమ్ము మండలం తిమ్మాపురంలోని ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న పనులను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల పునఃప్రారంభంలోగా పాఠశాలలో విద్యుత్, టాయిలెట్ల నిర్మాణం, తాగునీరు తదితర మౌలిక సదుపాయాలు పూర్తి చేయాలని కోరారు. ఆయన వెంట ఎంపీపీ బిక్కునాయక్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకటయ్య, పీఏసీఎస్ చైర్మన్ శ్రీశైలం, ప్రజా ప్రతినిధులు, మండల నాయకులు ఉన్నారు.

గంజాయి సరఫరా చేసే వారిపై కఠినంగా వ్యవహరించాలి

దేవరకొండ: దొంగతనాలు అరికట్టడంతో పాటు ఇతర మత్తు, మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం మోపాలని, నేరస్థులపై కఠినంగా వ్యవహరించాలని ఎమ్మెల్యే బాలునాయక్ అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం డీఎస్పీ గిరిబాబుతో పాటు నియోజకవర్గ పరిధిలోని సీఐలు, ఎస్ఐలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మత్తుకు అలవాటు పడి యువత పక్కదారి పడుతుందని, వారిపై నిఘా ఏర్పాటు చేసి గంజాయి రవాణాను అరికట్టాలని కోరారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే సాధారణ ప్రజలకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. పోలీసులు బాధ్యతతో పనిచేయాలని కోరారు. సమావేశంలో సీఐలు, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ హుండీ ఆదాయం రూ.12.87లక్షలు

కనగల్, జూన్ 10: మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద గల శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయ హుండీ ఆదాయాన్ని సోమవారం లెక్కించారు. 87 రోజులకు గాను 12 లక్షల 87 వేల 776 ఆదాయం సమకూరిందని జిల్లా ఎండోమెంట్ సహాయ కమిషనర్ కె.మహేందర్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ వెంకటలక్ష్మి, ఈవో జయరామయ్య, చైర్మన్ అల్లుబెల్లి నర్సింహారెడ్డి, మాజీ చైర్మన్లు కె.గోపాల్‌రెడ్డి, డి.కరుణాకర్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్లు జె.చంద్రయ్య, లింగయ్య, జూనియర్ అసిస్టెంట్లు ఉపేందర్‌రెడ్డి, ఆంజనేయులు, లింగస్వామి, నాగరాజు, ధర్మకర్తలు తదితరులు పాల్గొన్నారు.

దేవాలయం వద్ద విక్రయానికి బహిరంగ వేలం

దామరచర్ల, జూన్ 10: మండలంలోని కల్లెపల్లి శ్రీ బంగారు మైసమ్మ దేవాలయం వద్ద 2024-25 సంవత్సరానికి గాను దున్నపోతులను సేకరించుకునే, కొబ్బరికాయల అమ్మకాలు, తలనీలాలు సేకరించుకునే హక్కుల కోసం ఈ నెల 14వ తేదీన ఆలయం వద్ద బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ ధీరావత్ భాష్యానాయక్, ఆలయ కార్యనిర్వహణాధికారి గుజ్జుల కొండారెడ్డి తెలిపారు. దున్నపోతులు సేకరించుకునే హక్కు కోసం రూ.లక్ష డిపాజిట్, కొబ్బరి చిప్పలు, తలనీలాలు సేకరించుకునే హక్కు కోసం రూ.50వేల డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని తెలిపారు.

పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలి



గుర్రంపోడులో హెచ్‌ఎంలకు యూనిఫాంను అందిస్తున్న ఎంఈవో రాము

గుర్రంపోడు,త్రిపురారం, కనగల్, గట్టుప్పల్, జూన్ 10: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచడంతో పాటు వాటిని బలోపేతం చేయాలని ఎంఈవో తరి రాము, పలువురు హెచ్‌ఎంలు అన్నారు. సోమవారం జిల్లాలోని పలు మండలాల్లో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచితంగా పుస్తకాలు, నోట్‌బుక్స్ యూనిఫాంలు, మధ్యాహ్న భోజనం తదితర సౌకర్యాలను కల్పిస్తున్నట్లు తెలిపారు.


● గుర్రంపోడు మండల కేంద్రంలో హెచ్‌ఎంలకు సమభావన సంఘాల వారు కుట్టిన యూనిఫాంలను ఎంఈవో రాము అందించారు. పాఠశాల ప్రారంభమయ్యే 12వ తేదీనే విద్యార్థులకు ప్రజాప్రతినిధుల సమక్షంలో యూనిఫాం, పుస్తకాలు, నోట్‌బుక్స్ అందించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాలల హెచ్‌ఎంలు, ఎంఐఎస్ కోఆర్డినేటర్ రమేష్‌కుమార్, సీఆర్పీలు పాల్గొన్నారు.

● త్రిపురారం మండలంలోని కంపసాగర్, రాగడప గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమంలో హెచ్‌ఎం పద్మ మాట్లాడారు. కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా విద్యను అందిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కల్యాణి, టీచర్లు అంజికుమార్, అంజిబాబు, రమేష్, సైదులు, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

● కనగల్‌లోని ఎమ్మార్సీలో వివిధ గ్రామాలకు చెందిన పాఠశాలల హెచ్‌ఎంలకు విద్యార్థుల యూనిఫాంలు, పుస్తకాలను ఎంఈవో రాములు అందజేశారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు సత్తయ్య, రమేష్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

● గట్టుప్పల్ మండల పరిధిలోని ప్రాథమికోన్నత పాఠశాల తేరట్‌పల్లి ఉపాధ్యాయుడు ఉదావత్ లచ్చిరాం బడిబాటలో వినూత్నంగా ప్రచారం చేస్తున్నారు. సోమవారం శేరిగూడెం గ్రామంలో ఎడ్ల బండిపై పొలానికి వెళ్తున్న బాలుడిని చూశారు. ఎడ్ల బండిని ఆపి పెద్దలు పనికి, పిల్లలు బడికి పోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో కల్పిస్తున్న సౌకర్యాల గురించి వివరించారు.

జిల్లాలో బీజేపీ సంబురాలు



నల్లగొండ పట్టణంలో బీజేపీ శ్రేణుల సంబురాలు

నల్లగొండ, శాలిగౌరారం, జూన్ 10: నరేంద్ర మోదీ మూడోసారి ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా జిల్లాలో పలు చోట్ల బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా సంబురాలు నిర్వహించారు. బాణసంచా కాల్చి, స్వీట్లు పంపిణీ చేశారు.

● నల్లగొండ పట్టణంలోని క్లాక్‌టవర్ సెంటర్‌లో పెద్ద ఎత్తున బాణసంచాలు కాల్చి, స్వీట్లు పంచుకుని హర్షాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ పార్లమెంటు కోకన్వీనర్ పిల్లి రామరాజుయాదవ్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో నీలగిరిలో కాషాయ జెండా ఎగరడం ఖాయమని అన్నారు. గతాన్ని చూసుకుంటే ఈ సారి ఓటింగ్ శాతం పెరిగిందన్నారు. నియోజకవర్గ ప్రజలందరూ మార్పును కోరుకుంటున్నారని పేర్కొన్నారు. ఆరు గ్యారంటీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను నెరవేర్చడంలో విఫలమవుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు పోతేపాక సాంబయ్య, పెరిక మణికుమార్, బొజ్జ నాగరాజు, కంకణాల నాగిరెడ్డి, లకడాపురం వెంకన్న, రావెల్ల కాశమ్మ, నేవార్సు నీరజ, దాయం భూపాల్‌రెడ్డి ఉన్నారు.

● శాలిగౌరారంలో బీజేపీ ఆధ్వర్యంలో బాణసంచా కాల్చి సంబురాలు నిర్వహించారు. స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు జమ్ము రమేష్, నాయకులు బోడ రాజు, గోదల సురేష్ రెడ్డి, చాడ శ్యామ్, సుందర్‌రెడ్డి, యల్మాకంటి కిష్టయ్య, గట్టయ్య, బండారు లక్ష్మయ్య పాల్గొన్నారు.

'శ్మశానవాటిక స్థలాన్ని రక్షించాలి'

మిర్యాలగూడ, జూన్ 10: కబ్జాకు గురవుతున్న శ్మశానవాటిక స్థలాన్ని రక్షించాలని సుబ్బారెడ్డిగూడెం గ్రామానికి చెందిన మంద సైదులు, ఆదిమల్ల నాగేశ్వరరావు కోరారు. సోమవారం తహసీల్దార్‌కు గ్రామస్థులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుబ్బారెడ్డిగూడెం గ్రామ ఎస్సీకాలనీకి శ్మశానవాటిక లేకపోవడంతో ఎన్నో ఏళ్లుగా పాత కాల్వకట్టకు దహనం కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కాల్వను ఆనుకుని ఉన్న రైతులు శ్మశానవాటిక స్థలాన్ని కబ్జా చేసి దున్నుకుంటున్నారని ఆరోపించారు. దీనివల్ల ఎస్సీ కాలనీలో మరణాలు సంభవించినప్పుడు దహన సంస్కారాలకు ఇబ్బందులు పడాల్సి వస్తుందని అన్నారు. అధికారులు స్పందించి వెంటనే రక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఇంద్రపల్లి గురవయ్య, రెమిడాల యేసయ్య, మచ్చ నాగయ్య, మంద నగేష్, ఇంద్రపల్లి అభి తదితరులు పాల్గొన్నారు.

'శ్మశానవాటికను ధ్వంసం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి'

వేములపల్లి: చెరువు మట్టి పేరుతో శ్మశానవాటికను ధ్వంసం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి పాదూరి శశిధర్‌రెడ్డి అన్నారు. మండలంలోని మొల్కపట్నం ఊర చెరువు సమీపంలోని చెరువు పక్కన ఉన్న శ్మశానవాటికను ఆయన పరిశీలించి మాట్లాడారు. ఊర చెరువు సమీపంలో కొందరు వ్యక్తులు ఎలాంటి అనుమతి లేకుండా పదుల సంఖ్యలో ట్రాక్టర్లతో మట్టిని తరలిస్తూ శ్మశానవాటికను ధ్వంసం చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు పాదూరి కిరణ్‌రెడ్డి, సీపీఎం గ్రామశాఖ అధ్యక్షుడు బొమ్మగాని ఎల్లయ్య, రెమడాల కరుణాకర్, కొల్లిపాక సోమయ్య, పాపిరెడ్డి, సైదులు, పృథ్వీరెడ్డి, అంజయ్య, సోమేష్ పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు ఇవ్వాలి

తిప్పర్తి, జూన్ 10: పెండింగ్‌లో ఉన్న గ్రామ పంచాయతీ కార్మికుల వేతనాలను వెంటనే అందజేయాలని గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్ష కార్యదర్శులు కంచర్ల జానయ్య, పాలడుగు చంద్రయ్య డిమాండ్ చేశారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో వారు పాల్గొని మాట్లాడారు. కొన్ని గ్రామాల్లో 15, 16 నెలలుగా పంచాయతీ కార్మికులకు వేతనాలు అందలేదని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే పెండింగ్ వేతనాలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంపీవో జానయ్యకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కంచర్ల జానయ్య, పాలడుగు చంద్రయ్య, మైనం మల్లయ్య, వెంకన్న, సామేలు, పరమేష్, నాగయ్య, సౌందర్య, అషయ్య, బుజ్జమ్మ, ప్రమీల పాల్గొన్నారు.

దేవరకొండ నుంచి తిరుపతికి బస్సు సౌకర్యం

దేవరకొండ, జూన్ 10: దేవరకొండ ఆర్టీసీ డిపో నుంచి తిరుపతికి సూపర్ లగ్జరీ బస్సును సోమవారం పున ప్రారంభించినట్లు దేవరకొండ ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ పడాల సైదులు తెలిపారు. దేవరకొండ డిపో నుంచి ఉదయం 10 గంటలకు బయలుదేరి బస్సు హైదరాబాద్ చేరుకుంటుందన్నారు. హైదరాబాద్ నుంచి మధ్యాహ్నం 2.30 గంటలకు బయలుదేరి మాల్, కొండమల్లేపల్లి, సాగర్ మీదుగా తిరుపతికి చేరుకుంటుందని తెలిపారు. శ్రీకాళహస్తి, తిరుపతికి వెళ్లే ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, రిజర్వేషన్ సౌకర్యం కూడా ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు.

సంక్షిప్త సమాచారం...

అడవిదేవులపల్లి: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఎంపీపీ ధనావత్ బాలాజీనాయక్ మొక్కలను నాటి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కరుణాకర్‌రావు, ఎంపీవో మోసిన్‌బిన్‌అహ్మద్, ఏపీవో లావూడి సూరానాయక్, సిబ్బంది వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

కేతేపల్లి: మండలంలోని భీమారం గ్రామంలో ఇటీవల ఆర్థిక ఇబ్బందులతో మృతి చెందిన అవిరెండ్ల ఉపేందర్ కుటుంబానికి అతని స్నేహితులు అండగా నిలిచారు. స్నేహితులైన ఉత్తెర్ల నాగరాజు, దూబని నాగరాజు మృతుడి కుటుంబాన్ని పరామర్శించి 50 కిలోల బియ్యం అందజేశారు.

కేతేపల్లి: మండలంలోని గుడివాడ, కొర్లపహాడ్ గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలను ఎమ్మెల్యే వీరేశం పరామర్శించారు. గుడివాడ గ్రామానికి చెందిన ఆలకుంట్ల శాంతమ్మ, కొర్లపహాడ్ గ్రామానికి చెందిన ఆవుదొడ్డి రాంబాయమ్మ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. ఆయా గ్రామాల్లో పర్యటించిన ఎమ్మెల్యే మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు.

నల్లగొండ టౌన్: అక్రమ పట్టాను రద్దుచేయాలని దండెంపల్లి గ్రామస్థులు డిమాండ్ చేశారు. కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ గ్రామంలోని సర్వే నెంబర్ 101లో ప్రభుత్వ భూమిని గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అక్రమంగా ఆక్రమించుకున్నారని ఆరోపించారు. దీనిపై పూర్తి స్థాయిలో విచారించాలని, ప్రభుత్వ భూమిన కాపాడి భూమిలేని నిరుపేదలకు ఇవ్వాలని గ్రామస్థులు కోరారు.

చండూరు: ఎస్సీ, ఏబీసీ వర్గీకరణ ఉద్యమం చేపట్టి 30 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా జూలై 7న వరంగల్‌లో మందకృష్ణమాదిగ నాయకత్వంలో నిర్వహించే మాదిగల ఆత్మగౌరవ కవాతును విజయవంతం చేయాలని ఎమ్మెస్పీ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బకరం శ్రీనివాస్‌మాదిగ, ఇరిగి శ్రీశైలంమాదిగ కోరారు. మాదిగల ఆత్మగౌరవం కోసం గ్రామంలో ఉన్న ప్రతీ మాదిగ యువతీ, యువకులు చైతన్యవంతులై ఉద్యమానికి దన్నుగా నిలవాలని కోరారు. సమావేశంలో ఎమ్మెస్పీ జిల్లా సహాయ కార్యదర్శి నల్లగంటి రమేష్‌మాదిగ, మండల అధ్యక్షుడు ఇరిగి దుర్గాప్రసాద్, నాయకులు శంకర్, యేసు, యాదయ్య, రాజు పాల్గొన్నారు.

తిప్పర్తి: రైతుల ఉపయోగం కోసం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే వీడియో కాన్ఫరెన్స్‌లో రైతులు పాల్గొనాలని మండల వ్యవసాయ అధికారి సన్నిరాజు కోరారు. మంగళవారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు తిప్పర్తి మండల కేంద్రంలోని రైతు వేదికలో వ్యవసాయశాఖ, శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో రైతులకు విత్తన ఎంపిక, పత్తిలో అధిక దిగుబడులు, సేంద్రీయ వ్యవసాయంపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.

మునుగోడు: ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ఆ పార్టీ జిల్లా నాయకుడు పాల్వాయి జితేందర్‌రెడ్డి, మండల పరిషత్ మాజీ కోఆప్షన్ సభ్యుడు అన్వర్ మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి భువనగిరి ఎంపీ అభ్యర్థిని గెలిపించడంపై అభినందించారు. అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయించాలని కోరారు.

మాడ్గులపల్లి: మండలంలోని గజలాపురం గ్రామానికి చెందిన బట్టు దేవకమ్మను బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ బుసిరెడ్డి పాండురంగారెడ్డి పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు.

నార్కట్‌పల్లి: నిడమనూరు మండలం వెంగన్నగూడెం గ్రామానికి చెందిన పోలేపల్లి గోపీచంద్ అనే యువకుడు రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న ఆపద్బంధు ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ రూ.31,250లు ఆర్థికసాయం అందజేసింది.

చిట్యాల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యకు ప్రాధాన్యతనిచ్చి బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించాలని మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు కోరారు. భక్తమార్కండేయ పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో పది, ఇంటర్, డిగ్రీలో ప్రతిభ కనబరిచిన మండలంలోని పద్మశాలీ విద్యార్థులను ఆయన ఘనంగా సన్మానించారు.

హాలియా, తిరుమలగిరి (సాగర్): జేఈఈ అడ్వాన్స్‌డ్ ఆల్ ఇండియాస్థాయిలో తిరుమలగిరి (సాగర్) మండలం బట్టువెంకన్నబావి తండాకు చెందిన జటావత్ అభినయ్ 131వ ర్యాంకు సాధించాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి అభినయ్‌ను, అతని తల్లిదండ్రులను హాలియాలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభినయ్ మున్ముందు మరెన్నో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

రైతు భరోసా రైతు ఖాతాల్లో జమచేయాలి

దేవరకొండ, జూన్ 10: వర్షాకాలం ప్రారంభమైనందున రైతులకు పెట్టుబడులకు గాను రైతుభరోసా పథకం ద్వారా రైతుఖాతాల్లోకి ఎకరాకు రూ.7500 జమ చేయాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్ డిమాండ్ చేశారు. దేవరకొండలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాకాలం వచ్చినా రైతులకు పంట పెట్టుబడి సాయం గురించి ప్రభుత్వం నోరు మెదపడం లేదని విమర్శించారు. వెంటనే రైతు భరోసా డబ్బులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని చిన్నచూపు చూస్తోందని, రైతుల సమస్యలు పట్టించుకోవడం లేదన్నారు. రైతు భరోసా ద్వారా రైతు ఖాతాల్లో డబ్బులు జమ చేసి ఎరువుల కొరత రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



సర్టిఫికెట్లు అందజేస్తున్న చేస్తున్న ఎస్ఐ

నల్లగొండ, జూన్ 10: క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని, భవిష్యత్తు కు పునాదులు వేస్తాయని పలు వురు వక్తలు అభిప్రాయ పడ్డారు. సోమవారం దేవరకొండలోని స్పోర్ట్స్ అకాడమీలో జరిగిన బెల్ట్ ఎగ్జామ్స్‌లో అంగడిపేట కరాటే విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా వారికి ఎస్ఐ బెల్టులను ప్రదానం చేసి విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో తెలంగాణ, ఏపీ చీఫ్ ఎగ్జామినర్ రాపోలు సుదర్శన్, కరాటే మాస్టర్ సురేష్ గురువారెడ్డి, టి.రవళి, వి.మిథున్‌రెడ్డి విహాన్‌రెడ్డి, హనుమాన్‌రెడ్డి, జ్ఞానేశ్వర్, సాత్విక్, ధ్యాన్‌రెడ్డి, భరత్ కుమార్, భరత్‌కుమార్, అక్షిత, అఖిలేష్ తదితరులు పాల్గొన్నారు.